సాక్షి
ఏలూరు
శుక్రవారం । 27 । జనవరి । 2023



అక్షరాభ్యాస పూజలు

పాలకొల్లు సెంట్రల్: క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయంలోని సరస్వతి దేవి మండపం వద్ద గురువారం చిన్నారులకు అక్షరాభ్యాసాలు చేయించారు.



నేత్రపర్వంగా శ్రీవారి కల్యాణం

జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి క్షేత్రంలోని ఉపాలయంలో శ్రీ వేంకటేశ్వరస్వామి స్వామి కల్యాణం నేత్రపర్వంగా నిర్వహించారు.

మల్లికార్జునస్వామికి పూజలు



ఆగిరిపల్లి: స్థానిక శోభనాచలుని కొండపై వెలసిన దుర్గా పార్వతి సమేత మల్లికార్జున స్వామికి మాఘ పంచమి సందర్భంగా గురువారం విశేష పూజలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

రాజ్యాంగం న్యాయవ్యవస్థకు తల్లిలాంటిది



కోర్టు ప్రాంగణంలో జెండా ఎగురవేస్తున్న ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తం కుమార్

ఏలూరు (టూటౌన్): రాజ్యాంగం అమలులోకి వచ్చిన రోజును గణతంత్ర దినోత్సవంగా జరుపుకుంటున్నామని అలాంటి రాజ్యాంగం న్యాయ వ్యవస్థకు తల్లి వంటిదని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ అన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కోర్టు ఆవరణలో జాతీయ జెండాను ఎగుర వేసి వందన సమర్పణ చేసారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజ్యాంగాన్ని ఆధారంగా చేసుకుని న్యాయ వ్యవస్థలు పనిచేస్తున్నాయని చెప్పారు. కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా జడ్జి పి.మంగా కుమారి, రెండో అదనపు జిల్లా జడ్జి ఎస్.ఉమా సునంద, ఎనిమిదో అదనపు జిల్లా జడ్జి ఎం.సునీల్ కుమార్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి, పలువురు న్యాయమూర్తులు, ఏలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు టి.శశిధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధికి కృషి చేయాలి



క్యాంపు కార్యాలయంలో జాతీయ జెండా ఆవిష్కరించిన ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ

ఏలూరు టౌన్: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏలూరులోని క్యాంపు కార్యాలయంలో, అమీనాపేట సురేష్‌చంద్ర బహుగుణ పోలీస్ స్కూల్లో ఎస్పీ రాహుల్ దేవ్ శర్మ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారా సంక్రమించిన హక్కులను పరిరక్షించుకుంటూ ప్రజలంతా శాంతి సౌభ్రాతృత్వాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ప్రజలంతా ఐక్యంగా దేశాభివృద్ధికి తమ వంతు కృషి చేయాలన్నారు. జిల్లా పోలీస్ యంత్రాంగం మహిళల రక్షణకు నిత్యం ఎంతో కృషి చేస్తుందన్నారు. పోలీసు అధికారులు, సిబ్బందికి ఆయన మిఠాయిలు పంపిణీ చేసి, శుభాకాంక్షలు తెలిపారు.ఈ వేడుకల్లో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, ఇన్‌చార్జ్ డీఎస్పీ జీవీఎస్ పైడేశ్వర రావు, జంగారెడ్డిగూడెం ఇన్‌చార్జ్ డీఎస్పీ కేవీ సత్యనారాయణ, పోలవరం డీఎస్పీ లతాకుమారి, ఎస్బీ డీఎస్పీ రమేష్‌రెడ్డి, ఎస్బీ సీఐ వి.రవికుమార్, ఏఆర్ డీఎస్పీ కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో గణతంత్ర వేడుకలు



ఆఫీసర్స్ క్లబ్‌లో గణతంత్ర వేడుకలు

ఏలూరు(మెట్రో): గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టరేట్ లో గురువారం జాయింట్ కలెక్టర్ పి.అరుణ్ బాబు త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. తొలుత గాంధీ, అంబేద్కర్ విగ్రహాలకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దేశ సమగ్రత, సమైక్యతలకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి ఏవీఎస్ఎస్ మూర్తి, నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, ట్రైనీ ఉప కలెక్టర్ అపూర్వ భరత్, ఆర్డీఓ కె.పెంచల కిషోర్ తదితరులు పాల్గొన్నారు. ఆఫీసర్స్ క్లబ్ లో గురువారం జాయింట్ కలెక్టర్ పి.అరుణ్ బాబు జాతీయ జెండా ఆవిష్కరించారు.

రేపు రథసప్తమి వేడుకలు

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న క్షేత్రంలో శనివారం రథసప్తమి వేడుకలు నిర్వహించనున్నట్టు ఆలయ ఈఓ వేంద్ర త్రినాథరావు తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి స్వామి, అమ్మవార్లను సూర్యప్రభ వాహనంపై, రాత్రి 7 గంటల నుంచి చంద్రప్రభ వాహనంపై తిరువీధి సేవలు జరుపుతామన్నారు. భక్తులు పెద్ద ఎత్తున ఈ వేడుకల్లో పాల్గొనాలని కోరారు.

ప్రగతి పథంలో దూసుకుపోదాం

- అర్హులందరికీ సంక్షేమ ఫలాల లబ్ధి
- రిపబ్లిక్ డే వేడుకల్లో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరు (టూటౌన్): స్వాతంత్రోద్యమంలో ప్రాణాలు అర్పించిన ఎందరో త్యాగమూర్తుల త్యాగాలను స్మరించుకుంటూ జిల్లాను అన్ని రంగాల్లో ప్రగతిపథంలో ఉంచేందుకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ పిలుపు నిచ్చారు. 74వ గణతంత్ర దినోత్సవ వేడుకలు స్థానిక పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్‌లో గురువారం అట్టహాసంగా జరిగాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న కలెక్టర్ వెంకటేష్ ముందుగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ సంతృప్త స్థాయిలో పథకాలు అందజేస్తున్నామని వ్యవసాయ రంగంతో పాటు నీటిపారుదల, విద్య, వైద్యం, మహిళా సంక్షేమం, పారిశ్రామికాభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించామన్నారు. పేదల జీవన ప్రమాణాల స్థాయిని పెంచడమే నవరత్నాల కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు.

రైతు సంక్షేమానికి నిరంతర కృషి

జిల్లాలోని 540 భరోసా కేంద్రాల ద్వారా రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందుబాటులో ఉంచుతున్నామన్నారు. ఏటా రూ.623 కోట్ల సబ్సిడీతో సాగుకు ఉచిత విద్యుత్ ఇస్తున్నామని తెలిపారు. రైతు భరోసా సాయంగా రూ.223 కోట్లు, పంట రుణాలుగా రూ.7,407 కోట్లు, 42,139 మంది కౌలు రైతులకు రుణఅర్హత కార్డులు అందించినట్లు చెప్పారు. పోలవరం నిర్వాసితులకు పునరావాస ప్యాకేజీని త్వరితగతిని పూర్తి చేసి నిర్వాసితులను కాలనీలకు తరలిస్తున్నామన్నారు. వైఎస్సార్ పెన్షన్ కానుక కింద జిల్లాలో 2,73,867 మందికి పెన్షన్‌ను పెంచి అందజేస్తున్నట్లు తెలిపారు. 27,3132 డ్వాక్రా సంఘాలకు రూ.1084 కోట్లు రుణాలుగా అందించామని, జగనన్న ఇళ్ల కాలనీ లబ్ధిదారులకు అదనంగా రూ.109 కోట్లు రుణంగా అందించినట్లు చెప్పారు. వైఎస్సార్ ఆసరా పథకంలో రూ.330 కోట్లు, వైఎస్సార్ చేయూత కింద రూ.223.44 కోట్లు అందజేసినట్లు పేర్కొన్నారు. అమ్మఒడి పథకంలో ప్రస్తుత సంవత్సరం 1,84,249 తల్లుల ఖాతాలలో రూ.276.36 కోట్లు జమచేసినట్లు తెలిపారు. జగనన్న వసతి దీవెన పథకంలో రూ.106.77 కోట్లు, వసతి దీవెన పథకంలో రూ.35.12 కోట్లు విద్యార్థుల తల్లుల ఖాతాలకు జమ చేసినట్లు చెప్పారు. 1537 ప్రభుత్వ పాఠశాలల్లో నాడు-నేడులో రూ.430.80 కోట్లతో మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకంలో జిల్లాలోని 5.58 లక్షల కుటుంబాలకు చెందిన 9.47 లక్షల మంది 120 లక్షల పనిదినాలు కల్పించి రూ.246 కోట్లు వేతనాలుగా అందించినట్లు చెప్పారు.



ఏలూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో జెండా వందనం చేస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, ఐజీ పాలరాజు, ఎస్పీ రాహుల్‌దేవ్‌శర్మ, జేసీ అరుణ్‌బాబు



పోలీస్ పరేడ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్



దిశా వాహన ప్రదర్శన

పథకాలతో సంక్షేమ రాజ్యం

ఆరోగ్యశ్రీ పథకం ద్వారా 28 వేల మంది పేదలకు రూ.68 కోట్లతో వైద్య చికిత్సలు చేయించినట్లు చెప్పారు. ఆరోగ్య ఆసరా పథకంలో 22 వేల మంది లబ్ధిదారులకు రూ.12 కోట్ల ఆర్థిక సాయం అందించినట్లు చెప్పారు. జల్‌జీవన్ మిషన్ పథకంలో రూ.600 కోట్లతో ప్రతి ఇంటికి కుళాయి ద్వారా తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. వాటర్ గ్రిడ్ కార్యక్రమం ద్వారా 164 గ్రామాలకు రూ.205 కోట్లు ఖర్చుతో తాగునీటి సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. మహిళల రక్షణకు ఉద్దేశించిన దిశా చట్టాన్ని జిల్లాలో పటిష్టంగా అమలు చేస్తున్నామని, ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో జిల్లా రాష్ట్రంలో ముందంజలో ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్, ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ, ఐజీ పాలరాజు, ఎస్పీ రాహుల్ దేవ్ శర్మ, జేసీ పి.అరుణ్ బాబు, ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్‌పర్సన్ ఈశ్వరీ బలరాం, సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్ర, ఉప కలెక్టర్ అపూర్వ భరత్, డీఆర్ఓ ఏవీఎస్ఎన్ మూర్తి, ఆర్డీవో కె.పెంచల కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న శకటాల ప్రదర్శన

పెరేడ్ గ్రౌండ్స్‌లో వివిధ ప్రభుత్వ శాఖల శకటాల ప్రదర్శన ఆకట్టుకుంది. గృహనిర్మాణ, వైద్య ఆరోగ్య శాఖ, వ్యవసాయ శాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, 108, 104, అగ్నిమాపక శాఖ, పౌరసరఫరాలు, జలవనరులు, దిశ, డ్వామా, అగ్నిమాపక, విద్యా శాఖలు తాము చేపడుతున్న కార్యక్రమాలతో రూపొందించిన శకటాలు ఆకర్షించాయి. విద్యా శాఖ శకటానికి ప్రథమ బహుమతి లభించింది. వ్యవసాయ శాఖ శకటానికి రెండో బహుమతి, దిశ శకటానికి మూడో బహుమతి లభించింది.

ప్రత్యేక ఆకర్షణగా స్టాల్స్

పెరేడ్‌గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను కలెక్టర్ తదితరులు సందర్శించారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, మహిళా శిశు సంక్షేమ శాఖ, బీసీ కార్పొరేషన్, ఉపాధి హామీ తదితర శాఖల స్టాల్స్‌లో ప్రగతిని ప్రదర్శించారు. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో స్త్రీనిధి కింద రూ.91.09 కోట్లు రుణాలు అందజేశారు. ఉన్నతి పథకంలో రూ.10.38 కోట్ల చెక్కులను పంపిణీ చేశారు. ఫుడ్ ప్రాసెసింగ్, హయ్యర్ ఆర్డర్ ఎంటర్ ప్రైజెస్ ద్వారా 10 మందికి రూ.63.50 లక్షల రుణాలు అందజేశారు. యువతకు ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు.



వ్యవసాయశాఖ శకటం



గ్రామీణాభివృద్ధి శాఖ శకటం



నీటిపారుదల శాఖ శకటం

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



గిరిజన విద్యార్థుల సంప్రదాయ నృత్య ప్రదర్శన

ఏలూరు (టూటౌన్): గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా పెరేడ్ గ్రౌండ్‌లో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ముందుగా సెయింట్ థెరిస్సా బాలికల హైస్కూలుకు చెందిన 200 మంది నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. పెదవేగి సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థుల ప్రదర్శన అలరించింది. ఏలూరు సుబ్బమ్మదేవి ఉన్నత పాఠశాలకు చెందిన 32 మంది విద్యార్థుల ప్రదర్శన జాతీయ సమైక్యతను, సమగ్రతను చాటిచెప్పింది. ఐటీడీఏ తెల్లంవారిగూడెం చెందిన 32 మంది గిరిజన బాలికలు ప్రదర్శించిన ప్రదర్శన గోండ్ గిరిజన సంస్కృతిని చాటి చెప్పేలా సాగిరింది. అక్షర స్కూలు విద్యార్థుల మేరా ప్యారా భారత్ ప్రదర్శన చూపరులను కట్టిపడేసింది. సుబ్బమ్మదేవి ఉన్నత పాఠశాల, తెల్లంవారిగూడెం ఐటీడీఏ బృందం, ఏపి సోషల్ వెల్ఫేర్, పెదవేగి, అక్షర హైస్కూలు బహుమతులు అందుకున్నారు. వీరికి కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేసారు. కార్యక్రమంలో జిల్లా జడ్జి సి.పురుషోత్తం కుమార్, డీఐజీ పాలరాజు, ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ, ఎస్పీ రాహుల్ దేవ్ శర్మ పాల్గొన్నారు.



సెయింట్ థెరిస్సా విద్యార్థుల నృత్య ప్రదర్శన

పద్మశ్రీ అవార్డు గ్రహీతకు సత్కారం



పద్మశ్రీ అవార్డు గ్రహీత అబ్బారెడ్డి నాగేశ్వరరావును సత్కరిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, న్యాయమూర్తి పురుషోత్తం తదితరులు

ఏలూరు (టూటౌన్): పద్మశ్రీ అవార్డు గ్రహీత అబ్బారెడ్డి నాగేశ్వరరావును 74వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ దుశ్శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులు అభినందనలతో ముంచెత్తారు. పద్మశ్రీ అవార్డుకు ఆయన ఎంపిక కావడం ఎంతో గర్వకారణమని కలెక్టర్ పేర్కొన్నారు. నాగేశ్వరరావు గుంటూరు జిల్లా చేబ్రోలులో పుట్టినా ఏలూరులో స్థిరపడ్డారని చెప్పారు. ప్రస్తుతం ఆయన కంద్రిగగూడెంలోని రాజరాజేశ్వరినగర్‌లో ఉంటూ ఇక్కడనుంచే పరిశోధనకు అవసరమైన జాతీయ సెమినార్లకు, కాన్ఫరెన్స్‌లకు నేరుగా, ఆన్‌లైన్‌లో హాజరవుతున్న విషయాన్ని గుర్తు చేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ తాను అరుణాచల్ ప్రదేశ్‌లోని అటవీ శాఖలో శాస్త్రవేత్తగా పనిచేశానని, 2012లో పదవీ విరమణ చేసిన నాటి నుంచి ఏలూరులోనే ఉంటున్నట్లు చెప్పారు. పద్మశ్రీ అవార్డు రావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

బాలరాజును ఫోన్‌లో పరామర్శించిన సీఎం జగన్

బుట్టాయగూడెం: పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజును ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం ఫోన్‌లో పరామర్శించారు. ఈ సందర్భంగా బాలరాజు ఆరోగ్య పరిస్థితిని, వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. అధైర్యపడవద్దని ఎంతటి కష్టం వచ్చినా తాను అండగా ఉండి ఆదుకుంటానని సీఎం భరోసా ఇచ్చారని ఎమ్మెల్యే బాలరాజు తెలిపారు. ఫోన్‌లో పరామర్శించిన ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి బాలరాజు కృతజ్ఞతలు తెలిపారు. తాను కోలుకోవాలని దేవాలయాల్లో, మసీదు, చర్చిల్లో ప్రార్థనలు, పూజలు చేసిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు బాలరాజు కృతజ్ఞతలు తెలిపారు. రాజమండ్రి సాయి హాస్పటల్‌లో చికిత్సపొందుతున్న ఆయన గురువారం సాయంత్రం డిశ్చార్జ్ అయ్యారు.



సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలరాజు



జెండా వందనం చేస్తున్న ఐజీ పాలరాజు

మహనీయుల త్యాగఫలం

ఏలూరు టౌన్: బ్రిటీష్ పాలకుల నుంచి స్వాతంత్ర్యం సాధించేందుకు ఎందరో మహనీయులు తమ ప్రాణాలను త్యాగం చేశా రని ఏలూరు రేంజ్ ఐజీ జీ.పాలరాజు అన్నారు. ఏలూరులోని ఐజీ క్యాంపు కార్యాలయంలో ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల్ని స్మరించుకుంటూ దేశ సమైక్యతకు పాటుపడాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సిబ్బందికి ఆయనే స్వయంగా మిఠాయిలు పంచిపెట్టారు.

సేవలకు పురస్కారం

గణతంత్ర దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో మెరుగైన పనితీరు కనబర్చిన 234 మంది అధికారులు, సిబ్బందికి జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ప్రశంసా పత్రాలను అందజేశారు. వీరితో పాటు వివిధ రంగాల్లో సేవలు అందించిన స్వచ్ఛంద సంస్థలు, పలువురు స్థల దాతలకు ప్రశంసాపత్రాలను అందించారు.

– ఏలూరు (టూటౌన్)



కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్



వై.రామకృష్ణ (జిల్లా వ్యవసాయశాఖ), ఈ.రాంబాబు (ఈఈ, ఏపీఈడబ్ల్యూడీసీ), పీవీఎస్ రవికుమార్ (పీడీ, ఏపీ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు), కె.మంజుభార్గవి (డీఎం, సివిల్ సప్లయిస్), టీ.ప్రవీణ (కో-ఆపరేటివ్ జిల్లా అధికారి), ఆర్.విజయరాజు (పీడీ, డీఆర్‌డీఏ), ఎస్ఎస్‌పి వెంకటేశ్వరరావు (జిల్లా మేనేజర్, లీడ్ బ్యాంక్), ఎస్.నరేష్‌కుమార్ (పే అండ్ అకౌంట్స్)



టీ.వేణుగోపాల్ (పీడీ, హౌసింగ్), డాక్టర్ ఎం.నాగేశ్వరరావు (డీఎంఅండ్‌హెచ్ఓ), డాక్టర్ ఏవీఆర్ మోహన్ (డీసీహెచ్ఎస్), ఎన్ఎస్ కృపావరం (జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి), వి.త్రినాథరావు (ఈఓ, ఆర్‌జేసీ, ద్వారకాతిరుమల దేవస్థానం), జీవీకే మల్లికార్జునరావు (డీపీఓ), ఆర్.రామచంద్రరావు (డీపీఆర్ఓ), ఎన్‌వీవీ సత్యనారాయణ (ఎస్ఈ, గ్రామీణ నీటిసరఫరా)



టి.వెంకటేశ్వరరావు (సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్), టి.కృష్ణ (ట్రెజరీ, డిప్యూటీ డైరెక్టర్), పి.రమాదేవి (ఈఈ, ఐటీడీఏ, కేఆర్‌పురం), కేపీవీఎల్ పద్మావతి (జిల్లా అధికారి స్త్రీ శిశుసంక్షేమ శాఖ), కేవీ సాయిప్రసాదరావు (సైనిక్ వెల్ఫేర్), సీహెచ్ఆర్‌వీ స్వామి (డీఎస్పీ, జైళ్ల శాఖ), కె.కుమార్ (ప్రాంతీయ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్), జి.రమణ (నోడల్ అధికారి, డీఎల్‌డీఓ, జీఎస్‌డబ్ల్యూఎస్), టి.జగదీశ్వరరావు (కలెక్టరేట్), ఎ.కృష్ణ జ్యోతి (తహసీల్దార్, చింతలపూడి), జి.శ్రీధర్ (డిప్యూటీ తహసీల్దార్, లింగపాలెం), డి.కరుణప్రవంతి, (డిప్యూటీ తహసీల్దార్, చింతలపూడి)



జి.రవికుమార్ (వీఆర్ఓ, నూజివీడు), ఏవీ రమణారావు (తహసీల్దార్, ఉంగుటూరు), కే.కిరణ్మయి (డిప్యూటీ తహసీల్దార్, ఉంగుటూరు), పి.శ్రావణి (ఎస్ఏ, మండవల్లి), జె.శ్రీను నాయక్ (ఎంఆర్ఐ, ఏలూరు), ఎస్.శారాశాంతి (తహసీల్దార్, బుట్టాయగూడెం), బి.దుర్గామహాలక్ష్మి (డీటీ, ద్వారకాతిరుమల), టీఎన్ స్నేహన్ (జిల్లా కో-ఆర్డినేటర్, ఎస్‌బీసీసీ), వి.చైతన్య కుమార్ (ఏలూరు అర్బన్, డబ్ల్యూఈడీపీఎస్), బి.మెహర్‌ప్రభు (డీఐఓఎస్, జంగారెడ్డిగూడెం), జీవీఎస్ పైడేశ్వరరావు (ఎస్‌డీపీఓ, ఏలూరు), వి.వెంకటేశ్వరరావు (సీఐ, భీమడోలు), కె.లతా కుమారి (ఎస్‌డీపీఓ, పోలవరం), ఆర్.శ్రీను (ఎస్సై, వేలేరుపాడు)



యు.శ్రీనివాసరావు (ఎస్సై, కుక్కునూరు), వి.రవికుమార్ (సీఐ, డీఎస్‌బీ, ఏలూరు), కె.ఇంద్ర శ్రీనివాసరావు (దిశా పోలీస్‌స్టేషన్, ఏలూరు), కె.సుధాకరరెడ్డి (ఆర్ఎస్సై, డీఆర్ఏ, ఏలూరు), బి.నరేంద్రకుమార్ (ఆర్ఎస్సై, డీఆర్ఏ, ఏలూరు), సీహెచ్ గోపీనాథ్ (ఏఓ, డీపీఓ, ఏలూరు), ఎండీ రాజా అహ్మద్ (హెచ్‌సీ, ద్వారకాతిరుమల), సీహెచ్ రాఘవి (జీఎంఎస్‌కే, కొయ్యలగూడెం), జి.గాయత్రి (జీఎంఎస్‌కే, ధర్మాజీగూడెం), సీహెచ్ మురళీకృష్ణ (సీఐ, సీసీఎస్, ఏలూరు), ఎన్‌వీ సంపత్ కుమార్ (ఏఎస్సై, సీసీఎస్, ఏలూరు), కె.డానియేల్ (హెచ్‌సీ, వేలేరుపాడు), సీహెచ్ సౌఖ్య (జీఎంఎస్‌కే, ఏలూరు-2), కేవీఎస్‌వీ ప్రసాద్ (సీఐ, ఏలూరు త్రీటౌన్)



ఎన్.సత్యనారాయణ (లీడింగ్ ఫైర్‌మెన్, ఏలూరు), పి.ప్రశాంత్ (ఫైర్‌మెన్, ఏలూరు), బి.దుర్గాప్రసాద్ (ఎస్సై, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్), కె.విజయరాజు (ఎంవీఐ), వి.లక్ష్మి ప్రవీణా (ఏఎంవీఐ), జి.వెంకటేశ్వరరావు (డిప్యూటీ జైలర్), కె.శ్రీనివాసరావు (జైలర్), వి.అరుణకుమారి, (ఎస్ఈబీ ఎస్పీ), జీఎస్‌కే ధనరాజు (ఇన్‌స్పెక్టర్ ఎన్‌ఫోర్స్‌మెంట్), డి.శ్రీనివాసు (కానిస్టేబుల్, ఎన్‌ఫోర్స్‌మెంట్), ఎల్.రత్నకుమారి (ఎస్ఐ), డాక్టర్ షేక్ అకీబ్ షరీఫ్ (మెడికల్ ఆఫీసర్, వేలేరుపాడు)



డాక్టర్ జ్ఞానేష్ జ్యేష్ఠ, (మెడికల్ ఆఫీసర్, కొండ్రుకోట), గొల్లపల్లి అవినాష్ (ఎంఎల్‌హెచ్‌పీ, గొల్లపల్లి), డాక్టర్ వి.దివ్య (సీఎఎస్, చింతలపూడి), డి.రూపేష్ (ఏటీఎస్), వి.వీరాస్వామి (ఏఈ, కుక్కునూరు), జె.సురేష్ (డీవైఈఈ, ఏలూరు), కె.శ్రీనివాస్ (డిప్యూటీ ఈఈ, ఏలూరు), ఎం.రుహాన్సీ (ఈఈ, టెక్నికల్, ఏలూరు), ఈ.నర్సింహరావు (ఈఈ, జంగారెడ్డిగూడెం), జి.రామకృష్ణ (డిప్యూటీ ఈఈ, జంగారెడ్డిగూడెం), సీహెచ్‌కే దుర్గాప్రసాద లింగం (డివిజనల్ పీఆర్వో, ఏలూరు), పి.సాగర్ (ఫొటోగ్రాఫర్)

జగన్ పాలనలోనే ఎస్సీ, ఎస్టీలకు న్యాయం

- ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- కృష్ణాపురంలో గడపగడపకు మన ప్రభుత్వం
- తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో కార్యక్రమం వంద రోజులు పూర్తి





కృష్ణాపురంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, వంద రోజులు పూర్తయిన సందర్భంగా కేక్ కట్ చేస్తున్న మంత్రి కొట్టు

తాడేపల్లిగూడెం రూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీల అభివృద్ధి, సంక్షేమానికి వేల కోట్ల రూపాయలు ఖర్చు చేశారని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. గురువారం సాయంత్రం తాడేపల్లిగూడెం మండలం కృష్ణాపురం గ్రామంలో వందవ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, ప్రజాప్రతినిధులకు, పార్టీ శ్రేణులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ఐదేళ్ల పాలనలో ఎస్సీల అభివృద్ధికి రూ.33,635 కోట్లు ఖర్చు చేస్తే, వైఎస్ జగన్ మూడున్నరేళ్ల పాలనలో రూ.48,909 కోట్లు ఖర్చు చేశారన్నారు. ఎస్టీల అభివృద్ధికి చంద్రబాబు రూ.12,487 కోట్లు వెచ్చిస్తే, వైఎస్ జగన్ పాలనలో రూ.15,589 కోట్లు ఖర్చు చేశారన్నారు. దీన్ని బట్టి చూస్తే సీఎం జగన్ పాలనలోనే వారి అభివృద్ధికి అధిక నిధులు వెచ్చించినట్లు తేటతెల్లమవుతుందన్నారు. ఈ విషయాన్ని ఇటీవల ఎస్సీ, ఎస్టీలతో పవన్ ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రకటించకపోవడం శోచనీయమన్నారు. ఆయా సామాజికవర్గాలకు చంద్రబాబు హయాంలో అన్యాయం జరుగుతుంటే ఏనాడు పవన్ ప్రశ్నించలేదని దుయ్యబట్టారు. అయితే, జగన్ ప్రభుత్వంపై ప్రజల్ని తప్పుదారి పట్టిస్తున్నారని విమర్శించారు. సంక్షేమ పథకాల పేరిట రాష్ట్రాన్ని జగన్ అప్పులపాలు చేస్తున్నారని విషప్రచారం చేస్తున్నారన్నారు. చంద్రబాబు ఐదేళ్ళ పాలనలో పెద్దవాటాదారుడు ఎవరంటే రామోజీరావు అని వ్యాఖ్యానించారు. రూ.11వేల కోట్ల విలువైన పోలవరం ప్రాజెక్టును నామినేషన్ పద్ధతిలో రామోజీరావు అల్లుడికి కేటాయించిన ఘనుడు చంద్రబాబు అని విమర్శించారు. అటువంటి వ్యక్తులు నేడు పచ్చమీడియా వేదికగా ప్రభుత్వంపై అసత్యప్రచారాలు చేస్తున్నారన్నారు. దేశంలో అతి తక్కువ అప్పు కలిగిన రాష్ట్రంగా నాల్గవ స్థానంలోనూ, అప్పులు సక్రమంగా చెల్లిస్తున్న రాష్ట్రాల్లో ప్రథమ స్థానంలో ఆంధ్రప్రదేశ్ ఉందని, దీనిని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారని గుర్తు చేశారు. చంద్రబాబు హయాంలో ఏ రకమైన బడ్జెట్ ఉందో అదే విధమైన బడ్జెట్ నేడు జగన్ పాలనలో ఉందన్నారు. అయితే, నాడు చంద్రబాబు ఇంతటి సంక్షేమ పథకాలను ఎందుకు అమలు చేయలేదని నిలదీశారు. రాష్ట్రంలో నేడు సమర్థవంతమైన పాలన సాగుతుందన్నారు. గతంలో వైఎస్సార్, సీఎం వైఎస్ జగన్ ప్రజలకు న్యాయం చేసేందుకు పాదయాత్రలు చేశారని, నేడు లోకేష్ పాదయాత్ర దేనికోసమని ప్రశ్నించారు. వార్డు మెంబరుగా కూడా గెలవలేని వ్యక్తి దొడ్డిదారిన ఎమ్మెల్సీగా, మంత్రిగా లోకేష్ పనిచేశాడన్నారు. మరలా ప్రజాక్షేత్రంలో పోటీ చేస్తే తుక్కుతుక్కుగా ఓడించారని ఎద్దేవా చేశారు. చంద్రబాబు, పవన్ ద్వయంలో పవన్‌ను సీఎం చేస్తానంటేనే గాని ఓట్లు పడే పరిస్థితి లేదని, దీనికి చంద్రబాబు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. తొలుత గ్రామంలో రూ.60లక్షలు వ్యయంతో నిర్మించనున్న గ్రామదేవత అలుసులమ్మ ఆలయానికి శంకుస్థాపన చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు ముత్యాల ఆంజనేయులు, ఎంపీపీ పొనుకుమాటి శేషులత, వైస్ ఎంపీపీలు కట్టా రంగబాబు, సూర్పని రామకృష్ణ, సర్పంచ్‌లు రాజమహేంద్రవరపు లక్ష్మణరావు, పిచ్చుకల రాజారావు, ఎలిపే గాంధీ, ఎంపీటీసీ సభ్యులు మట్టా సత్యనారాయణ, మార్లపూడి సుబ్బారావు, జంపెల్ల సత్యవతి, నార్ని శంకరరావు, కళింగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సంపతరావు కృష్ణారావు, మండల సచివాలయాల కన్వీనర్ ముప్పిడి సంపత్‌కుమార్, జిల్లా నీటి సంఘం మాజీ డైరెక్టర్ ఈదర వెంకటేశ్వరరావు, సొసైటీ చైర్మన్లు వెలిశెట్టి నరేంద్రకుమార్, జడ్డు హరిబాబు, చిక్కాల సత్యనారాయణ, ఉప సర్పంచ్‌లు మేణ్ణి రామారావు, చిట్టూరి కాశీవిశ్వనాథం, తహసీల్దార్ వైకేవీ.అప్పారావు, ఎంపీడీవో ఎం.వెంకటేష్ పాల్గొన్నారు.

పెద శేషవాహనంపై దర్శనమిచ్చిన శోభనాచలుడు



ఆగిరిపల్లి: స్థానిక శోభనాచల వ్యాఘ్రలక్ష్మీ నరసింహ స్వామి మాఘమాస రథసప్తమి ఉత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారు పెద్ద శేష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 10 గంటలకు స్వామివారి కల్యాణ మండపంలో శాంతి కల్యాణాన్ని మంచిర్యాలకు చెందిన శ్రీకాళహస్తి రాజరాజేశ్వరరావు దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించారు. రాత్రి 7 గంటలకు గ్రామ కాపు సంఘం ఆధ్వర్యంలో స్వామివారిని పెళ్లికుమారుడిగా అలంకరించి పెద్ద శేష వాహనంపై గ్రామోత్సవం జరిపించారు. అనంతరం స్వామివారి కల్యాణ మండపంలో నిత్య కల్యాణ మహోత్సవాన్ని ఆలయ అర్చకులు వేదాంతం శేషుబాబు, అనంతకృష్ణ, ఇతర వేద పండితుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ ఈవో ఎస్.భవాని పర్యవేక్షించారు.

ఇంటింటికీ సంక్షేమం



కైకలూరు : ఆటపాకలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు బ్రోచర్ అందిస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న కైకలూరు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు



జంగారెడ్డిగూడెం రూరల్: పుట్లగట్లగూడెం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరిస్తున్న చింతలపూడి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా

పోలవరం స్పిల్‌వేపై జాతీయ జెండా ఆవిష్కరణ

పోలవరం రూరల్: అన్ని అవాంతరాలను అధిగమించి పోలవరం ప్రాజెక్టు త్వరితగతిన పూర్తి అవుతుందన్న ఆశాభావాన్ని పోలవరం ప్రాజెక్టు అథారిటీ సీఈవో శివానందకుమార్ వ్యక్తం చేశారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వేపై జాతీయ జెండాను ఆయన గురువారం ఆవిష్కరించారు. అనంతరం ప్రాజెక్టు సిబ్బంది, నీటిపారుదల శాఖ అధికారులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ దేశంలో లభ్యమవుతున్న జలవనరులను సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అప్పుడే దేశం అన్ని రంగాల్లో త్వరితగతిన అభివృద్ధి చెందుతుందన్నారు. పోలవరం ప్రాజెక్టు త్వరితగతిన పూర్తి అయ్యేందుకు తమవంతు సహకారాన్ని అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పీపీఏ సభ్య కార్యదర్శి ఎం.రఘురాం, చీఫ్ ఇంజినీర్ రాజేష్‌కుమార్, జలవనరుల శాఖ ఎస్ఈ నరసింహమూర్తి, మెగా ఇంజనీరింగ్ సంస్థ సీజీఎం ఎం.ముద్దుకృష్ణ, జీఎం గంగాధర్, ఏజీఎం రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



పోలవరం ప్రాజెక్టు వద్ద జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం

టిప్పర్ బోల్తా

ఉంగుటూరు: కైకరం - చేబ్రోలు గ్రామాల మధ్య జాతీయ రహదారిలో గురువారం ఓ టిప్పర్ లారీ వేగంగా వెళుతూ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్, మరో వ్యక్తికి గాయాలయ్యాయి. వీరిని తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చేబ్రోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి ఆర్టీసీ రోడ్డు భద్రతా వారోత్సవాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రజా రవాణా శాఖ ఏలూరు జిల్లా ఆధ్వర్యంలో ఈ శుక్రవారం నుంచి రోడ్డు భద్రతా వారోత్సవాలు నిర్వహించనున్నామని జిల్లా ప్రజా రవాణా అధికారి ఎన్‌వీఆర్ వరప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వారోత్సవాల ప్రారంభ సభను ఏలూరు ఆర్టీసీ డిపో గ్యారేజ్‌లో శుక్రవారం నిర్వహించనున్నామన్నారు. ఫిబ్రవరి 1వ తేదీ వరకు జరిగే ఈ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా 28న సిబ్బందికి శిక్షణ, 29న నిర్వహణ దినోత్సవం, 30న సిబ్బంది కుటుంబ సభ్యులకు అవగాహన సదస్సు, 31న రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామన్నారు. 2వ తేదీన వారోత్సవాల ముగింపు సందర్భంగా ఉత్తమ డ్రైవర్లకు అవార్డులు, పాఠశాల విద్యార్థులకు రోడ్డు ప్రమాదాలపై చిత్రలేఖన పోటీలు ఉంటాయన్నారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.2.19 లక్షల విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఇద్దరు భక్తులు గురువారం రూ.2,19,116 లను విరాళంగా అందజేశారు. ఏలూరుకు చెందిన నార్ని వీర వెంకటేష్ రూ.1,11,116 లను నిత్యాన్నదాన కార్యాలయంలో జమ చేయగా, ఆలయ సూపరింటెండెంట్ రమణరాజు దాతకు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు. అలాగే తాడేపల్లిగూడెంకు చెందిన మేడిశెట్టి శ్రీనివాసరావు రూ.1.08 లక్షలను జమ చేయగా, ఏఈఓ ఎం.దుర్గారావు విరాళం బాండ్ పత్రాన్ని అందజేశారు.